సాక్షి మెదక్

గురువారం । 1 । మే । 2025



మేం మళ్లీ రాలేం

పూర్వ వీఆర్వో, వీఆర్ఏలు తిరిగి మాతృ శాఖలోని వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

వివరాలు 12లో ▸



పేదింటి సరస్వతీ పుత్రులు

బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పేదింటి సరస్వతీ పుత్రులు మెరిశారు.

వివరాలు 12లో ▸

నేటి నుంచి పోలీస్ యాక్ట్

మెదక్ మున్సిపాలిటీ: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో గురువారం నుంచి ఈనెల 31 వరకు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.

న్యూస్‌రీల్

ఓటమి గెలుపునకు నాంది

కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్యపడొద్దని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఫెయిల్ అయిన 300 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన చేయిస్తామని తెలిపారు. గతేడాది జిల్లా 18వ స్థానంలో నిలవగా, ఈసారి ఇతర జిల్లాలకు పోటీగా 12 స్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా డీఈఓ రాధాకిషన్, సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్య పడకుండా ప్రత్యేక తరగతులకు హాజరై సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు




ధాన్యంలో తేమశాతం పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ ఆర్డీఓ రమాదేవి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా తేమశాతం, ఎంత తూకం వేస్తున్నారు..? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యంను ఆరబోసి అధికారులు సూచించిన తేమశాతం పాటించాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

3, 4 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

రామాయంపేట(మెదక్): ఈనెల 3, 4 తేదీల్లో రామాయంపేటలో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రతినిధి మల్లేశం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారని మండిపడ్డారు. బీడీ కట్టపై పుర్రె గుర్తుతో బీడీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిందన్నారు. కార్మికులకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ లేదని, జిల్లాలో పీఎఫ్ కార్యాలయం లేకపోవడంతో వారు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు. మహాసభల నేపథ్యంలో ఈనెల 4వ తేదీన రామాయంపేటలో కార్మికులతో భారీ స్థాయి ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా నాయకురాలు బాలమణి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన హర్షగౌడ్ కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన కనిగిరి రాజు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి సాక్షులు, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పోరాట ఫలితమే అంగన్‌వాడీలకు సెలవులు

మెదక్ కలెక్టరేట్: సీఐటీయూ పోరాట ఫలితమే అంగన్‌వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మే నెల సెలవులు ప్రకటించిందని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ, నర్సమ్మ అన్నారు. బుధవారం మెదక్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐసీడీఎస్ 50 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం మే నెలంతా సెలవులు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సమరశీల పోరాటాలకు అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేట మున్సిపాలిటీ రికార్డు

సిద్దిపేట జోన్: సిద్దిపేట మున్సిపాలిటీ చరిత్రలోనే అరుదైన రికార్డు సాధించింది. ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం ఇంటి పన్ను రాయితీలో బుధవారం ఒక్క రోజే కోటి 5 లక్షల రూపాయలు చెల్లించి ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

పదిలో 12వ స్థానం

96.87 శాతం ఉత్తీర్ణతతో మెరుగుపడిన ఫలితాలు

- సత్తాచాటిన బాలికలు
- జిల్లా టాపర్‌గా తూప్రాన్ గురుకుల విద్యార్థి అభిలాష్
- ఫలించిన కలెక్టర్, డీఈఓ ప్రణాళిక

ఎనిమిదేళ్లలో ఫలితాలు ఇలా..

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	జిల్లా స్థానం
2016-17	91.66	7
2017-18	90.05	9
2018-19	97.49	7
2019-20, 2020-21	(కోవిడ్ నేపథ్యంలో) 100 శాతం	
2021-22	93.45	11
2022-23	90.84	13
2023-24	92.90	18
2024-25	96.88	12



పరీక్షలు రాసింది	ఉత్తీర్ణత సాధించింది	జిల్లా స్థానం	బాలికలు శాతం	బాలురు శాతం
10,370	10,045	12	97.73	95.94

బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మెతుకుసీమ విద్యార్థులు మెరిశారు. గతేడాది 92.90 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచిన మెదక్ జిల్లా, ఈసారి 96.87 శాతంతో 12వ స్థానానికి ఎగబాకింది. ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా తూప్రాన్ గురుకుల పాఠశాల విద్యార్థి అభిలాష్ నిలిచాడు. కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈఓ రాధాకిషన్ పక్కా ప్రణాళిక ఉత్తీర్ణత శాతం పెరగడానికి దోహదపడింది.

– పాపన్నపేట(మెదక్)

జిల్లాలో మొత్తం 10,370 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 97.73 శాతం ఉత్తీర్ణతతో బాలికలు మెరిశారు. బాలురు 95.94 శాతం ఉత్తీర్ణతతో ధీటుగా నిలిచారు. కాగా జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌లకు చెందిన ఉన్నత పాఠశాలలు 225 ఉండగా, అందులో 86 ప్రభుత్వ పాఠశాలలు, 28 ప్రైవేట్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా టాపర్‌గా తూప్రాన్ గురుకుల పాఠశాల విద్యార్థి అభిలాష్ నిలిచాడు. ఈయన 589 మార్కులు సాధించాడు. కాగా జిల్లావ్యాప్తంగా ఈసారి బాలికలు మెరిశారు. దాదాపు అన్ని మండలాల్లో మెజార్టీగా వారే టాపర్లుగా నిలిచారు. జిల్లాలో వివిధ యాజమాన్యాలకు చెందిన 225 ఉన్నత పాఠశాలలుండగా, 10,370 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 4,994 బాలురు, 5,376 బాలికలు ఉన్నారు. కాగా 4,791 బాలురు, 5,254 బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

86 పాఠశాలలు.. 100 శాతం

జిల్లాలో 225 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 86 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి. ఇందులో జెడ్పీ పాఠశాలలు 60, కేజీబీవీలు 9, మోడల్ స్కూల్స్ 4, బీసీ వెల్ఫేర్ 4, టీడబ్ల్యూఆర్ 3, ఎస్‌డబ్ల్యూఆర్‌లు 3, మైనార్టీ 1, రెసిడెన్షియల్ 2, ప్రైవేట్ పాఠశాలలు 28 ఉన్నాయి.

పక్కా ప్రణాళికతో ముందుకు

ప్రభుత్వ పాఠశాలలను పరిపూర్ణ వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈఓ రాధాకిషన్ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. పల్లె నిద్రలో భాగంగా కలెక్టర్ జక్కపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన బడిబాట, నర్సాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, రాత్రి పూట నిద్ర, ఉదయం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన తీరు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దోహదపడ్డాయి. ఆయన ఏ మండలానికి అధికారిక పర్యటనకు వెళ్లినా పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. డీఈఓ రాధాకిషన్ సూచన మేరకు టీచర్లు విద్యార్థులను దత్తత తీసుకోవడం, ఉదయం వేక్ అప్ కాల్స్ చేయడం, స్పెషల్ క్లాసులు నిర్వహించడం, క్రమం తప్పకుండా పోషకులతో సమావేశాలు ఏర్పాటు చేయడం, సాయంత్రం స్నాక్స్ అందించడం, గ్రౌండ్ బేస్ లెర్నింగ్‌కు శ్రీకారం చుట్టడం ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడ్డాయి.

గ్రేడింగ్ స్థానంలో మార్కులు

పదో పరగతి మెమోల్లో మళ్లీ మార్కుల విధానం ప్రవేశపెట్టారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలన్న ఉద్దేశంతో దశాబ్ద కాలం క్రితం మార్కులకు బదులు గ్రేడింగ్ విధానం ప్రారంభించారు. అప్పట్లో విద్యార్థులు ఎన్ని మార్కులు సాధించింది తెలిసేది కాదు. 90 నుంచి 91 (ఏ1) 81 నుంచి 90 (ఏ2), 71 నుంచి 80 (బీ1), 61 నుంచి 70 (బీ2), 51 నుంచి 60 (సీ1), 41 నుంచి 50 (సీ2) 35 నుంచి 40 (డీ), 35 కంటే మార్కులు తగ్గితే (ఈ) గ్రేడ్ ఇచ్చే వారు. అయితే ఉన్నట్టుండి గ్రేడింగ్ విధానం మార్చి, మార్కుల విధానం ప్రవేశపెట్టడంపై విద్యావేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధిలో అవినీతి ఊట

సోషల్ ఆడిట్‌తో వెలుగులోకి..

మెదక్‌జోన్: జాతీయ ఉపాధి హామీ పనుల్లో అవినీతి ఊట ఊరుతోంది. ఏడాది పాటు చేసిన పనులకు సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్‌తో అసలు విషయం బయటపడుతోంది. మొన్న నర్సాపూర్ మండలంలో క్షేత్రస్థాయి అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించి రూ. 9.50 లక్షలు స్వాహా చేస్తే.. నిన్న శివ్వంపేట మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు మరి కొంత మంది సిబ్బంది రూ. 2.90 లక్షల అవినీతికి పాల్పడినట్లు తేలింది.

జిల్లాలో రూ. 163.65 కోట్లు విడుదల

జిల్లాలో గతేడాదికి సంబంధించి ఉపాధి పనుల కోసం రూ. 163.65 కోట్ల నిధులు విడుదలయ్యాయి. వాటిలో రూ. 102.55 కోట్లు కూలీలు చేసిన పనుల నిమిత్తం విడుదల కాగా, సిమెంట్ రోడ్లు, కోళ్లు, గొర్రెల ఫాంలు, పశువుల పాకలు, నర్సరీల్లో మొక్కల పెంపకం, ప్లాస్టిక్ బ్యాగులు.. తదితర సామగ్రి కోసం మరో రూ. 61.10 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 98 శాతం పనులు పూర్తి చేశారు. కాగా ఉపాధి పనులకు సంబంధించి ఏడాదికోసారి జిల్లాలోని అన్ని గ్రామాలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. అనంతరం మండల కేంద్రాల్లో ప్రజాదర్బార్ ఏర్పాటుచేసి ఒక్కో గ్రామంలో ఎన్ని పనులు చేశారు..? ఎంతమంది కూలీలు పనులు చేశారు.. వారికి చెల్లింపులు, మెటీరియల్ పనులకు సంబంధించి చెల్లింపులు ఎంత అనే వివరాలు ప్రజల సమక్షంలో వెల్లడిస్తారు. ఇందులో ఎలాంటి తప్పులు దొర్లినా వెంటనే సంబంధిత అధికారులను దోషులుగా నిలబెడతారు. అక్రమంగా డ్రా చేసిన డబ్బులను రికవరీ చేయడంతో పాటు జరిమానా సైతం విధిస్తారు.

మొన్న నర్సాపూర్.. నిన్న శివ్వంపేటలో

జిల్లాలో ఇప్పటివరకు నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. అయితే ఆ రెండు మండల్లాల్లో అవినీతి బయటపడింది. నర్సాపూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకంలో నాటని మొక్కలను నాటినట్లు.. వాటికి ఏడాది పాటు నీరు పోసినట్లు.. అవి పెరిగి పెద్దగా అయినట్లు ఫారెస్ట్ అధికారులు రూ. 9.50 లక్షల అవినీతికి పాల్పడినట్లు ప్రజాదర్బార్‌లో గుర్తించారు. అలాగే గత నెల 29వ తేదీన శివ్వంపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గోమారం గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్‌తో పాటు మరో క్షేత్రస్థాయి అధికారి కలిసి రూ. 2.90 లక్షల అవినీతికి పాల్పడినట్లు తేలింది. అవినీతికి పాల్పడిన సొమ్ముతో పాటు అందుకు రూ. 32 వేల జరిమానాతో కలిపి వెంటనే చెల్లించాలని సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లాలో 21 మండలాలు ఉండగా, ఇప్పటివరకు 2 మండలాల్లో మాత్రమే ఈ సోషల్ ఆడిట్ జరిగింది. మిగితా 19 మండలాల్లో త్వరలో నిర్వహించనున్నారు. వాటిలో ఎంత అవినీతి బట్టబయలుకానుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.

అభ్యుదయ వాది బసవేశ్వరుడు



బసవేశ్వరుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, తదితరులు

అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ కలెక్టరేట్: అభ్యుదయవాది అయిన బసవేశ్వరుడి ఆశయాలతోనే సమాజంలో మార్పు వస్తుందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త బసవేశ్వరుడని కొనియాడారు. ఆయన బోధించిన అభ్యుదయవాద సాంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. కార్యక్రమంలో బసవ లింగాయత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు

భారతీయ వైమానిక దళంలో చేరడానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగ అవకాశాలను అందిస్తుందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లాలోని అర్హత, ఆసక్తిగల యువతీ, యువకులు ఈనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 040-27758212 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాసంగి పంట కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.

పుర ఆదాయానికి గండి

పేట మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు



రామాయంపేట మున్సిపాలిటీ వ్యూ

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని ఇళ్లు, దుకాణాల సముదాయాన్ని గుర్తించడంలో ఆశాఖ అధికారులు విఫలమవుతున్నారు. సరైన చర్యలు చేపట్టకపోవడంతో పుర ఆదాయానికి గండి పడుతోంది. మున్సిపాలిటీ పరిధిలో రామాయంపేట, గుల్పర్తి, కోమటిపల్లి గ్రామాలతో పాటు రామాయంపేట, కోమటిపల్లి తండాలు ఉన్నాయి. మొత్తం జనాభా 17,860 ఉండగా, 5,500 గృహాలు ఉన్నాయి. గతంలో భువన్ యాప్ ద్వారా సర్వే నిర్వహించిన ఆశాఖ అధికారులు అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని వాటిని గుర్తించారు. ఈ మేరకు వారు ఇంటింటికీ తిరిగి కొలతలు సేకరించి వివరాలు రూపొందించారు. ఇళ్లతో పాటు వ్యాపారవర్గాలకు సంబంధించి 130 వరకు అనుమతి లేనివి ఉన్నాయని అప్పటి సర్వేలో తేల్చారు.

అనుమతి ఒకటి.. నిర్మాణం మరోటి

పట్టణంలో చాలా మంది కేవలం ఒక అంతస్తు నిర్మాణానికి మాత్రమే అనుమతి పొంది ఏకంగా మూడు, నాలుగు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. పన్ను భారం తగ్గించుకోవడానికి పెద్ద, పెద్ద భవనాలు ఉన్న వారు సైతం తమకు ఒక అంతస్తు మాత్రమే ఉందని రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. రాజకీయంగా ముడిపడి ఉన్న అంశం కావడంతో అధికారులు సైతం పట్టించుకోలేదు. గతంలో అనుమతి లేని నిర్మాణాలను కాదని, మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 20 వరకు మాత్రమే అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు చెబుతున్నారు. నామమాత్రంగా కొన్ని అనుమతి లేని వాటిని గుర్తించారు. అయితే సర్వేలో అనుమతి లేని నిర్మాణాలను గుర్తించిన అధికారులు వాటికి జరిమానా విధించాలి. వాటిని ఎప్పుడు నిర్మించారో వివరాలు సేకరించి అప్పటినుంచి పన్ను వసూలు చేయాలి. ఒక అంతస్తుకు మాత్రమే అనుమతి తీసుకొని రెండు, మూడు అంతస్తులు నిర్మించుకున్న వారికి సైతం ఇదే వర్తింపజేయాలి. అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలకు సంబంధించి పనులు నిలిపివేయాల్సి ఉంటుంది.

20 లోపే అక్రమ నిర్మాణాలు

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని నిర్మాణాలు 20 లోపే ఉన్నట్లు తమ సర్వేలో తేలింది. ఈ మేరకు వారికి నోటీసులు అందజేశాం. గతంలో గుర్తించిన అనుమతి లేని ఇళ్ల సంఖ్య తనకు తెలియదు.

– దేవరాజ్, టీపీఓ

ధాన్యం తీసుకోని మిల్లర్లపై చర్యలు

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న, శ్రీనివాస్‌రావు

నర్సాపూర్ రూరల్: ధాన్యం తీసుకోని రైస్ మిల్లర్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం తూకం, ట్యాబ్ ఎంట్రీ, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని ఎక్కడైనా రైస్ మిల్లర్లు తీసుకోకుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద 30 వరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఒకవేళ అందుబాటులో లేకుంటే ఏఎంసీల నుంచి తెచ్చుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సి బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఆయన వెంట సీసీ రవీందర్, కమిటీ సభ్యులు లావణ్య, సుమలత, సీఏ నవనీత ఉన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

మహిళల భద్రత కోసమే షీటీమ్స్

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: మహిళలు, బాలికల భద్రత కోసమే షీటీమ్స్ పనిచేస్తున్నాయని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో షీటీమ్స్ నిర్వహించిన పలు కార్యక్రమాలను వివరించారు. జిల్లావ్యాప్తంగా నలుగురు ఈవ్ టీజర్స్‌పై ఎఫ్ఐఆర్, 38 మందిపై ఈ పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే తూప్రాన్, మెదక్ డివిజన్‌లలో మొత్తం 97 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 64 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712657963కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డ్ మహేందర్ కుటుంబానికి రూ. 3 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శైలేందర్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొలి ప్రయత్నంలోనే జడ్జిగా..

నంగునూరుకు చెందిన మల్యాల సాహితీ ప్రతిభ


మల్యాల సాహితీ

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ హైకోర్టు జడ్జి కోసం నిర్వహించిన వివిధ ప్రక్రియలో నంగునూరుకు చెందిన మల్యాల సాహితీ విజయం సాధించింది. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన మల్యాల అన్నపూర్ణ, రాజు పెద్ద కూతురు మల్యాల సాహితీ బెంగళూర్‌లోని రేవా యూనివర్సిటీలో లా విద్య పూర్తి చేసింది. తెలంగాణ హైకోర్ట్ జడ్జి నోటిఫికేషన్ విడుదల చేయడంతో దరఖాస్తు చేసుకుంది. వివిధ దశల్లో జరిగిన ప్రక్రియలో విజయం సాధించడంతో తొలి ప్రయత్నంలోనే జడ్జిగా నియామకమైంది.

సాంస్కృతిక పోటీల్లో యువకుడి ప్రతిభ


లోకేశ్‌కు బహుమతి అందజేస్తున్న వెంకీ

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణ యువత ఆధ్వర్యంలో రిథమ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో కౌడిపల్లి యువకుడికి సోలో డ్యాన్స్‌లో ప్రథమ బహుమతి లభించింది. 26, 27 తేదీల్లో కరీంనగర్ జమ్మికుంటలో వివిధ విభాగాలలో రిథమ్ డ్యాన్స్ అకాడమీ పోటీలు నిర్వహించింది. ఇందులో కౌడిపల్లికి చెందిన సంధ్యగల్ల లోకేశ్ సోలో డ్యాన్స్ సీనియర్ విభాగంలో పోటీల్లో పాల్గొనగా ప్రథమ బహుమతి సాధించాడు. దీంతో జబర్దస్త్ ఆర్టిస్ట్ వెంకీతోపాటు నిర్వాహకుల నుంచి బహుమతి అందుకున్నట్లు లోకేశ్ తెలిపాడు. లోకేశ్ ప్రస్తుతం ట్రిపుల్‌ఈ డిప్లొమా పూర్తిచేశారు.

ఉత్తమ సేవలకు ఆర్టీసీ ప్రగతి చక్రం పురస్కారాలు


పురస్కారం అందజేస్తున్న డీఎం హుస్సేన్

జహీరాబాద్: ఉత్తమ సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్రం పురస్కారాలు అందజేశారు. బుధవారం స్థానిక బస్‌డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ క్యాష్ అవార్డులతోపాటు ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. ప్రథమ బహుమతి కింద రూ.800, ద్వితీయ బహుమతి కింద రూ.600, తృతీయ బహుమతి కింద రూ.400 అందజేశారు. ఉద్యోగ విరమణ పొందుతున్న మొగులప్ప, వెంకన్న, వహీద్, ప్రమీలలకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి తిరుమలేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బసవేశ్వరుడి ఆశయ సాధనకు కృషి చేయాలి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి


నివాళులర్పిస్తున్న నిర్మలారెడ్డి, తదితరులు

సంగారెడ్డి జోన్: బసవేశ్వరుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి సూచించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో బసవేశ్వర 892వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్‌తో పాటు అధికారులు లింగాయత్ సభ్యులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవకు అహర్నిశలు పాటుపడిన మహోన్నీయుడని గుర్తు చేశారు. వీరశైవ లింగాయత్ భవన్ నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ రాణి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా లింగాయత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి


గాయాలతో చిన్నారి

అల్లాదుర్గం(మెదక్): మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన అల్లాదుర్గంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు.. అల్లాదుర్గానికి చెందిన మస్తాన్ భేరేషి కూతురు పాతీయ (3) ఇంటి ఎదుట ఆడుకుంటున్న తరుణంలో గుంపులుగా వచ్చిన కుక్కలు చిన్నారి పై దాడి చేశాయి. కుటుంబీకులు, కాలనీవాసులు వచ్చి కుక్కలను తరమివేశారు. అప్పటికే చిన్నారి తలపై, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

మేం మళ్లీ రాలేం..

రెవెన్యూ శాఖపై ఆసక్తి చూపని పూర్వపు వీఆర్వో, వీఆర్‌ఏలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 3,386 మంది
- జీపీవోలుగా వెళ్లేందుకు 562 మంది దరఖాస్తు
- అర్హత సాధించింది 481 మంది
- పాత సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్



సాక్షి, సిద్దిపేట: గ్రామాల్లో రెవెన్యూ అధికారుల పాలనను మళ్లీ తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో పని చేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కానీ అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు. పూర్వపు వీఆర్వో, వీఆర్‌ఏలు తిరిగి మాతృశాఖలోని వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి గత నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, ఫిజికల్‌గా కలెక్టరేట్లలో దరఖాస్తులను స్వీకరించారు. పాత సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం, జాబ్ ప్రమోషన్ చాట్‌ను ప్రకటించకపోవడంతో జీపీవోలుగా వచ్చేందుకు చాలా మంది ఆసక్తి చూపడం లేదు.

562 మంది దరఖాస్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పూర్వపు వీఆర్వోలు, వీఆర్‌ఏలు 3,386 మంది విధులు నిర్వర్తించేవారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టంను తీసుకొచ్చింది. అందుకోసం క్షేత్రస్థాయిలో రెవెన్యూ గ్రామానికి ఒకటి చొప్పున జీపీవో పోస్టును మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,365 రెవెన్యూ గ్రామాలున్నాయి. తిరిగి రెవెన్యూ శాఖలోకి వెళ్లేందుకు 562 మందే దరఖాస్తు చేశారు. వీఆర్‌ఏలు అయితే ఇంటర్ పాసై ఉండటంతోపాటు ఐదేళ్ల సర్వీస్/డిగ్రీ ఉంటే ఎలాంటి సర్వీస్ అవసరం లేదు. దరఖాస్తుల్లో పొందుపరిచిన అర్హతలను పరిశీలించగా 81 మందివి రిజక్ట్ కాగా 481 మంది పరీక్షకు అర్హత సాధించారు.

పాత సర్వీసు పరిగణించకపోవడంతో

వీఆర్వో, వీఆర్‌ఏగా చేసిన సర్వీసు, ప్రస్తుతం విధులు నిర్వరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సర్వీసులను పరిగణలోకి తీసుకోమని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే జీపీవోలకు జాబ్ చార్ట్ ప్రకటించారు. కానీ ప్రమోషన్ చార్ట్ ప్రకటించలేదు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలో మూడేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయా శాఖలలో ప్రమోషన్‌లు రానున్నాయి. ఈ నేపథ్యంలో జీపీవోలుగా పని చేసేందుకు తక్కువ సంఖ్యలో ముందుకు వచ్చారని తెలుస్తోంది.

481 దరఖాస్తుల వివరాలు:

జిల్లా	వీఆర్వోలు	వీఆర్‌ఏలు	మొత్తం
సిద్దిపేట	51	142	193
మెదక్	55	56	111
సంగారెడ్డి	96	81	177

సర్వీసు పరిగణలోకి తీసుకోవాలి

వీఆర్వో, వీఆర్‌ఏ పాత సర్వీసుతోపాటు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న సర్వీసును పరిగణలోకి తీసుకుంటే చాలా మంది వచ్చే అవకాశం ఉండేది. అలాగే జీపీవోలకు సంబంధించి ప్రమోషన్ చార్ట్‌ను సైతం ప్రకటించాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాత సర్వీసును పరిగణలోకి తీసుకోవాలి.

– ఆకుల రవీందర్, అధ్యక్షుడు, పూర్వపు వీఆర్వోల సంఘం

సీసీఎల్‌ఏకు పంపించాం

పాత వీఆర్వోలు, వీఆర్‌ఏలు జీపీఏలుగా వచ్చేందుకు దరఖాస్తు చేసిన వాటిని పరిశీలించాం. సీసీఎల్‌ఏ తెలిపిన ప్రకారం అర్హతలు ఉన్న వారి పేర్లను సీసీఎల్‌ఏకు పంపించాం.

– అబ్దుల్ రహమాన్, ఏవో, కలెక్టరేట్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

జేసీబీ, బైక్ ఢీకొని యువకుడు


బాలక్రిష్ణ

తూప్రాన్: జేసీబీ, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నర్సంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన బాలక్రిష్ణ(22) మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే నర్సంపల్లి మీదుగా గజ్వేల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

మినీ వ్యాను బోల్తా పడి ఒకరు..


ఖలీల్‌బాషా(ఫైల్)

చేగుంట(తూప్రాన్): మినీ వ్యాను బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మాసాయిపేట మండలం బొమ్మారం గేటు సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లా ముక్రా గ్రామానికి చెందిన ఖలీల్‌బాషా(38) మినీ వ్యాను డ్రైవర్‌గా పని చేస్తున్నాడు, బుధవారం తెల్లవారు జామున బాలానగర్‌లో సరుకులు లోడ్ చేసుకొని భీంగల్‌కు వస్తున్నాడు. ఈక్రమంలో బొమ్మారం గేటు వద్ద వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాను నడుపుతున్న ఖలీల్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని మరొకరు

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం కొత్తూరు గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(40) పెయింటింగ్ పనిచేస్తుంటాడు. బుధవారం బైక్‌పై మేడ్చల్‌కు పెయింటింగ్ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికొస్తున్నాడు. మార్గమధ్యలో కొత్తూరు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమ్మరి రాజు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో గుర్తు తెలియని ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఏఎస్‌ఐ గాలయ్య కథనం మేరకు.. దుర్గమ్మ ఆలయం ముందు ఉన్న మంజీరా పాయల వద్దకు సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆలయ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై బ్రౌన్ కలర్ నిక్కర్ మాత్రమే ఉందని, మద్యం మత్తులో స్నానానికి వెళ్లి నీట మునిగి ఉంటాడని అనుమానిస్తున్నారు. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 57920 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పశువుల దొంగలు అరెస్టు

వర్గల్(గజ్వేల్): వ్యవసాయ పొలం నుంచి గేదెలను అపహరించిన ముగ్గురు బుధవారం వర్గల్ మండలం మజీద్‌పల్లి చౌరస్తావద్ద బేగంపేట పోలీసులకు చిక్కారు. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్ మండలం నెంటూరుకు చెందిన భీమగల్ల కిష్టయ్య పొలం వద్ద కట్టేసిన రెండు పాడిగేదెలను కొద్ది రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వాటి కోసం వెతికినప్పటికీ ఫలితం దక్కలేదు. నాలుగు రోజుల కిందట బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం తెల్లవారుజామున మజీద్‌పల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. టాటా ఏస్ వాహనంలో అనుమానాస్పదంగా కన్పించిన నెంటూరు గ్రామస్తుడు కొత్తోల్ల కిష్టయ్య(45), శివ్వంపేట మండలం నవాబ్‌పేటకు చెందిన పకీర్ శాదుల్లా(30), ఎమ్‌డీ ముస్తఫా బేగ్(27)లను అదుపులోకి తీసుకొని విచారించారు. నెంటూరులో రెండు గేదెలను అపహరించుకుపోయినట్లు ఒప్పుకున్నారు. వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, వాహనంతో పాటు, రూ.1,03,000 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రూ.20 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- హైదరాబాద్ నుంచి కర్ణాటకకు తరలింపు
- పోలీసుల అదుపులో నిందితుడు

జహీరాబాద్: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిరాగ్‌పల్లి సమీపంలో గల సహారా దాబా వద్ద 65వ జాతీయ రహదారిపై సీసీఎస్ బృందంతో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటక వైపు అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఇండిగో కారును తనిఖీ చేయగా డిక్కీలో గోధుమ రంగు కవర్ చుట్టి 40 ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. నిందితుడు, కారు డ్రైవర్ జహీరాబాద్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన జీ.తిరుమలేశ్‌గా గుర్తించారు. నిందితుడి దూరపు బంధువైన బీదర్‌కు చెందిన గుండప్ప చెప్పినట్లుగా రూ.50 వేలకు ఆశ పడి కారులో గంజాయిని బగ్దల్‌లో ఉన్న వినోద్‌కు ఇచ్చేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి సుమారు 80 కిలోల వరకు ఉంటుందని, రూ.20 లక్షలు విలువ చేస్తుందని ఎస్‌ఐ వివరించారు. కారుతోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.


గంజాయి, నిందితుడిని చూపుతున్న పోలీసులు

బాలికపై అత్యాచారం కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష


బానోత్ శ్రీను

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి న్యాయస్థానం బుధవారం తీర్పు నిచ్చింది. కొల్లూరు పోలీసుల కథనం మేరకు.. 2023 సెప్టెంబర్‌లో ఝరాసంగం మండలం భోజ్యా నాయక్ తండాకు చెందిన బానోత్ శ్రీను డాన్స్ అసిస్టెంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. తెల్లాపూర్‌లోని విల్లాస్‌లో పిల్లలకు డాన్స్ నేర్పించడానికి వచ్చి డాన్స్ గ్రూపులోని ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాటి ఇన్‌స్పెక్టర్ సంజయ్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ రవీందర్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సుభాష్, కోర్టు కానిస్టేబుల్ నర్సింహులు, ఏఎస్‌ఐ రవీందర్ రెడ్డి సరైన సాక్ష్యాధారాలను సేకరించి సంగారెడ్డి కోర్టు ముందు ఉంచారు. ఈ కేసును విచారించిన ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి కే.జయంతి నిందితుడు భానోత్ శ్రీనుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సూరరెడ్డి వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా చూసిన పోలీస్ అధికారులను మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు అభినందించారు.

పేదింటి సరస్వతీ పుత్రులు

బుధవారం విడులైన పదవ తరగతి ఫలితాల్లో పేదింటి సరస్వతీ పుత్రులు మెరిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. ఇంట్లో కష్టాలు ఉన్నా ఎదుర్కొని అత్యుత్తమ మార్కులు సాధించారు.

హోంగార్డు కూతురు..


ఎస్. రాజేశ్వరీ

కౌడిపల్లి(నర్సాపూర్): పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.రాజేశ్వరీ 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. స్వగ్రామం కిష్టాపూర్ కాగా వెల్మకన్నలో అమ్మమ్మగారి ఇంటివద్ద ఉంటూ చదువుతుంది. తండ్రి ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా, తల్లి గృహిణిగా ఉన్నారు. బాసర ట్రిబుల్‌ఐటీలో సీటు వస్తే ఇంజనీరింగ్ చేయనున్నట్లు తెలిపింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల టాపర్‌గా నిలవడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రైతు బిడ్డ మండల టాపర్


రాజేశ్వరీ

చిన్నశంకరంపేట(మెదక్): నిరుపేద రైతుబిడ్డ పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. చిన్నశంకరంపేట మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాశబోయిన క్రిష్ణ, భాగ్య కూతురు రాజేశ్వరీ రోజు రెండు కిలోమీటర్లు కాలినడకన వచ్చి మడూర్ జెడ్పీపాఠశాలలో చదివింది. కష్టం ఎదురైనా చదువును ఇష్టంగా చేసుకొని పదవ తరగతి ఫలితాల్లో 570 మార్కులు సాంధించి మండల టాపర్‌గా నిలిచింది. తన కూతురిని ట్రిపుల్ ఐటీ చదివించాలనే కల ఉందని విద్యార్థి తండ్రి కృష్ణ తెలిపారు.

తండ్రి కార్పెంటర్.. కూతురు టాపర్


ప్రశాంతి

రామాయంపేట(మెదక్): ప్రగతి ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కమ్మరి ప్రశాంతి పదవ తరగతిలో 600 గాను 560 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఆమె స్వగ్రామం చేగుంట మండలం కిష్టాపూర్ . తండ్రి కమ్మరి మహేందర్‌కు గ్రామంలో కార్పెంటర్‌గా పని చేస్తాడు. అతడి కష్టంతోనే ఆ కుటుంబం సాగుతుంది. మహేందర్ పెద్ద కుమారుడు ఇంటర్ పూర్తి చేయగా, కూతురు పదో తరగతి చదువుతుంది. తన తండ్రి కష్టం చూసి బాధ కలుగుతుందని, దీనితో తాను చదువుపై దృష్టి సారించి రాత్రింబవళ్లు కష్టపడి చదివి ర్యాంక్ సాధించినట్లు ప్రశాంతి తెలిపింది. తనకు డాక్టర్ కావాలని కోరిక ఉందని ఆమె పేర్కొంది.

కష్టాలు పక్కన పెట్టి.. లక్ష్యాన్ని గురి పెట్టి


శ్రీలేఖ

నారాయణఖేడ్: తండ్రి లేడన్న బాధ.. తల్లి కష్టపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కష్టం.. అయినా మొక్కవోని ధైర్యంతో ఆ చిన్నారి చదువుపై దృష్టి సారించింది. పదవ తరగతి ఫలితాల్లో ఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న శ్రీలేఖ 581 మార్కులతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచింది. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన అవుటి యాదవులు, మౌనిక ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతురే శ్రీలేఖ. యాదవులు కొన్నేళ్ల కిందట మరణించారు. కుటుంబ భారం, కష్టాలు పైన పడటంతో మౌనిక కండక్టర్‌గా విధుల్లో చేరారు. తమ పిల్లలకు కష్టాలు రాకూడదని చదివిస్తుంది. ఉపాధ్యాయురాలు కావాలనేదే తన లక్ష్యమని శ్రీలేఖ చెబుతుంది.

తండ్రి చనిపోయాడనే దుఃఖాన్ని దిగమింగుకొని


సిరి చందన

నంగునూర్(సిద్దిపేట): మండలంలోని నర్మెట ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదువుతున్న గంధమల్ల సిరి చందన పరీక్షలు రాస్తున్న సమయంలో తండ్రి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంగ్లిష్ పరీక్ష రాసి ఇంటికి రాగానే తండ్రి చనిపోయాడని తెలియడంతో మనో వేదనకు గురైంది. దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షలు రాసిన సిరి చందన 471 మార్కులు సాధించింది.

తండ్రి దినసరి కూలీ.. తల్లి బీడీలు చుడుతూ..


శ్వేత

చేగుంట(తూప్రాన్): చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే కొటారి శ్వేత పదో తరగతిలో 564 మార్కులు సాధించి మండల స్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. శ్వేత తండ్రి కుమార్ ఓ ప్రైవేటు పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. తల్లి జ్యోతి బీడీలు చుడుతూ కూతురిని చదివిస్తున్నారు. రోజూ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చేగుంట పాఠశాలకు వచ్చి చదువుకునేది.

మట్టిలో మాణిక్యం నందిని


నందినిని అభినందిస్తున్న ఎంఈఓ, కార్యాలయ సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరి గుంతం ఉన్నత పాఠశాలలో చదువుతున్న నందిని 554 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. నందిని కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలే. తండ్రి 2023లో అనారోగ్యంతో మృతి చెందడంతో ఆడపిల్లల భారం తల్లి దుర్గమ్మపై పడింది. నందిని రెండవ సోదరి ఇంటర్ చదివి కుటుంబ పోషణ భారం కావడంతో తల్లితో పాటు వేరే చోట కూలీ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నందిని నానమ్మతో కలిసి గ్రామంలోని ఉంటూ చదువుతుంది. తోబుట్టువులు ఇచ్చిన ప్రోత్సాహంతో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి వారి నమ్మకాన్ని నిలబెట్టింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సత్యనారాయణ రావు, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.

సెలవులు.. నైపుణ్యాల నెలవులు

విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. నిన్నటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ప్రస్తుతం సమ్మర్ క్యాంపులపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా కొత్త విషయాలు నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

- సమ్మర్ క్యాంపునకు అపూర్వ స్పందన
- ఎంఈఓ మహతీ లక్ష్మీ ఆధ్వర్యంలో బెజ్జంకిలో నిర్వహణ
- స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, కరాటే వంటి వాటిపై శిక్షణ
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

బెజ్జంకిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. ఏప్రిల్ 24 నుంచి 3 తేదీ వరకు ఎంఈఓ మహతీ లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, కరాటే, కాలీగ్రాఫీ, ఎథిక్స్, అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు వేసవిలో బయట తిరగకుండా ఉండటమే కాకుండా విజ్ఞానాన్ని, సృజనాత్మకతని పెంపొందిస్తారని తల్లిండ్రులు సైతం ఆసక్తిని కనబరుస్తూ పిల్లలను పంపుతున్నారు.


బెజ్జంకిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

180 మంది హాజరు

బెజ్జంకితోపాటు కల్లెపెల్లి, ముత్తన్నపేట, వీరాపూర్, పోతారం, రేగులపల్లె, దాచారం గ్రామాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సుమారు 180 మంది హాజరవుతున్నారు. మరింత మంది ఎన్‌రోల్ చేసుకుంటారని కో ఆర్డినేటర్ వడ్లకొండ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.


చిత్రలేఖనం నేర్పుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మణిశంకర్

సృజనాత్మకత పెరుగుతోంది



సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో సృజనాత్మకత, మానవతా విలువలు పెంపొందుతాయి. విద్యార్థులు ఉత్సాహంగా క్యాంపులో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం బాగుంది. 40 మంది వచ్చే క్యాంపునకు 180 మంది విద్యార్థులు హాజరు కావడం సంతోషంగా ఉంది.

– వడ్లకొండ శ్రీనివాస్, క్యాంపు కోఆర్డినేటర్

సమ్మర్ క్యాంపు బాగుంది



వేసవి సెలవుల్లో బయట తిరగకుండా ప్రభుత్వం సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం బాగుంది. దీని వల్ల విద్యార్థులకు మరింత పరిజ్ఞానం పెరుగుతుంది.

– బెజ్జంకి చందు, విద్యార్థిని తండ్రి

తల్లిదండ్రులు ప్రోత్సాహం



బెజ్జంకిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు పిల్లలు, తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. రోజు వివిధ విభాగాల్లో నైపుణ్యం పొందిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌కు ఆదరణ బాగుంది.

– పట్నం రమేశ్, స్పోకెన్ ఇంగ్లిష్ బోధకుడు